సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం। 8। అక్టోబర్। 2025



పశుగ్రాస వెతలకు చెక్

మెట్టలో పశుగ్రాసం సాగులో మెలకువలు తెలుసుకుంటే వేసవిలో పశువుల పోషణకు ఇబ్బంది ఉండదని పశు సంవర్ధక అధికారులు సూచిస్తున్నారు. 8లో ▸



తప్పిన పెనుప్రమాదం

పెనుగొండ సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయం వద్ద ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనగా.. అది మిగతా బైక్‌లపైకి దూసుకెళ్లింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. 8లో ▸



మావుళ్లమ్మ దీక్షాధారణ ప్రారంభం

మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి సందర్భంగా మండలి దీక్షా మాలధారణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. 8లో ▸

న్యూస్‌రీల్

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా ధర్నా



మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా ధర్నా

భీమవరం: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణను నిరసిస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్, అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ రాష్ట్ర కన్వీనర్ కోన జోసఫ్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రవేటీకరణ దళితులకు తీరని నష్టమన్నారు. నిరుపేదలు, బలహీనవర్గాలకు విద్య విషయంలో అండగా ఉండి ప్రోత్సహించాల్సిన కూటమి ప్రభుత్వం ప్రవేటీకరణ బాట పట్టడం దారుణమన్నారు. ఈది రవికుమార్, జంగం మాణిక్యాలరావు, బి.కమలాకర్, పట్టెం శుభాకర్, కొండేటి లాజర్, గాతల సందీప్, గంటా రాహుల్ రిచర్డ్స్, అంబటి ఆనందకుమార్ పాల్గొన్నారు.

పని గంటలు తగ్గించాలి



ప్రకాశంచౌక్ సెంటర్‌లో నిరసన

భీమవరం: పెంచిన పని గంటలు తగ్గించాలని, ఎనిమిది గంటల పని విధానం కొనసాగించాలని అసెంబ్లీలో తీర్మానించిన బిల్లును రద్దు చేయాలని మంగళవారం భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతుల సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పోరాటం చేసి ఎనిమిది గంటల పని విధానాన్ని సాధించుకుంటే నేడు కార్పొరేట్, సంపన్నుల కోసం 13 గంటల పని విధానాన్ని తీసుకువచ్చి అసెంబ్లీలో తీర్మానం చేయడం సిగ్గుచేటన్నారు. మహిళలు పని చేసే చోట సరైన సౌకర్యాలు, రక్షణ లేకపోవడంతో పని గంటలు పెంచడం వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్, సీఐటీయు జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, వైకుంఠరావు, జార్జి పాల్గొన్నారు.

టపాసుల అమ్మకాల్లో నిబంధనలు పాటించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో దీపావళి టపాసులు తయారీ, అమ్మకాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిబంధనల మేరకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో దీపావళి టపాసుల తయారీ, అమ్మకాలకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కలెక్టర్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా అధికారులతో కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దీపావళిని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకోవడానికి అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలను చేపట్టాలని ఆదేశించారు. లైసెన్సు లేకుండా టపాసులు తయారుచేసినా, అమ్మినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గతంలో లైసెన్సులు పొంది ప్రస్తుతం రెన్యువల్ కానీ మందు గుండు సామగ్రి తయారీ షెడ్లను క్షేత్రస్థాయిలో పోలీస్, రెవిన్యూ శాఖలు విధిగా తనిఖీచేసి ధ్రువీకరించాలన్నారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ.. నిబంధనల మేరకు తనిఖీల్లో లోటుపాట్లు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. డీఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిరుద్యోగుల పోరుబాట

- సమస్యల పరిష్కారం కోరుతూ రోడ్డెక్కుతున్న మున్సిపల్ కార్మికులు
- సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్
- ఇంజనీరింగ్ కార్మికులకు రూ.21 వేలు చేయాలి
- నేడు మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో ధర్నాలు



మస్టర్ పాయింట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించనున్నారు. గతంలో రాష్ట్ర వ్యాప్త సమ్మె విరమణ సందర్భంగా అప్పట్లో సంబంధిత అధికారులు కార్మిక సంఘాలతో చేసుకున్న ఏ ఒక్క ఒప్పందాన్ని, హామీని అమలు చేయక చేయకపోవడంతో ఉద్యోగులు, కార్మికులు ఆందోళన బాట పట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం 12వ పీఆర్‌సీ ప్రకటించి ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెం.36 ప్రకారం నెలకు రూ.21 వేలు వేతనం ఇవ్వాలని, 2023 డిసెంబర్ సమ్మెకాలపు ఒప్పందాల అమలుకు తక్షణం జీవోలు విడుదల చేయాలని కార్మికులు, ఉద్యోగులు కోరుతున్నారు.

రాష్ట్రంలోని మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై గతంలో సమ్మె చేసిన సమయంలో ప్రభుత్వం తరపున ఒప్పందాలు కుదుర్చుకున్న అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ఫైనాన్స్ విభాగానికి పంపించారు. ఈ లోగా ఎన్నికల కోడ్ రావడంతో ఆ ఫైలు ముందుకు కదలలేదు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల ఫైలును ఆమోదించకుండా ఫైనాన్స్ డిపార్టుమెంట్ వద్ద ఉన్న ఫైలును వెనక్కు రప్పించడం పట్ల మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ 2024 డిసెంబర్ 26 నుంచి దశలవారీగా ఆందోళనలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఈనెల 8న ధర్నాలు నిర్వహించాలని యూనియన్ నిర్ణయించింది.

చాలీచాలని వేతనం ఎన్నాళ్లు?

మున్సిపల్ కార్మికులకు ఇచ్చేది కొద్దిపాటి వేతనమే. అయినా వారితో చేయించేది గొడ్డు చాకిరీ.. ఎప్పటికైనా తమ బతుకుల్లో వెలుగులు రాకపోతాయా? తమ సమస్యలు తీరకపోతాయా? అనే ఆశతో మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు మౌనంగా తమ విధులు నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే ఏడాది క్రితం సమ్మె చేశారు. సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీలు ఇచ్చారు. వీటిలో ఏ ఒక్కటీ నెరవేరలేదు. దీంతో మళ్ళీ ఆందోళన బాట పట్టారు మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు. దీనిలో భాగంగా ఇప్పటికే మస్టర్ పాయింట్ల వద్ద తెల్లవారుజామున ఆందోళన చేశారు.

90 శాతం మంది ఆప్కాస్ ఉద్యోగులే

ఏలూరు నగర పాలక సంస్థలో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల్లో 90 శాతం మంది ఆప్కాస్ ఉద్యోగులే ఉన్నారు. ఏలూరు నగర పాలక సంస్థలో దాదాపు 1,170 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా వీరిలో పర్మినెంట్ ఉద్యోగులు కేవలం 250 మంది మాత్రమే ఉన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు 800 మంది, స్కూల్ స్వీపర్లు 120 మంది పనిచేస్తున్నారు. ఈ లెక్క ప్రకారం దాదాపు వెయ్యి మంది ఉద్యోగులు, కార్మికులు అంతా ఆప్కాస్ ఉద్యోగులే.

12వ పీఆర్‌సీ ప్రకటించాలి



రాష్ట్ర ప్రభుత్వం తక్షణం 12వ పీఆర్‌సీ ప్రకటించాలి. ఐఆర్ ఇవ్వాలి. 2023 జూలై నుంచి ఎరియర్స్ చెల్లించాలి. జీపీఎఫ్ ఖాతాలు తెరవాలి. మూడు సంవత్సరాల సరెండర్ లీవుల వేతనాలు చెల్లించాలి. మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల పట్ల పాలకులు చిన్నచూపు చూడటం తగదు. గత సమ్మె కాలపు ఒప్పందాల అమలుకు జీవోలు విడుదల చేయాలి.

బి.సోమయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కుటుంబ పోషణకు ఇక్కట్లు



పారిశుద్ధ్య కార్మికులకు చాలీచాలని వేతనాలు అందిస్తుండటంతో మా కుటుంబ పోషణ కోసం అనేక ఇబ్బందులు పడుతున్నాం. పెరిగిన నిత్యావసరాల ధరలు, పెంచిన విద్యుత్ ఛార్జీలు, ఇంటి అద్దెలు భారంగా మారాయి. పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలి.

– అంగులూరి జాన్ బాబు, మున్సిపల్ కార్మికుడు, ఏలూరు కార్పొరేషన్

వేతనం రూ.21 వేలు చేయాలి



మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెం.36 ప్రకారం కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలి. స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాల అమలుకు ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫార్సులు అమలు చేయాలి. టూల్ కిట్స్, యూనిఫారం అందించాలి. వారాంతపు సెలవులు, జాతీయ, పండుగ సెలవులు, సీఎల్‌లు అమలు చేయాలి.

– కలం సాంబశివరావు, ఇంజనీరింగ్ విభాగం వర్కర్, ఏలూరు కార్పొరేషన్

రిటైర్‌మెంట్ బెనిఫిట్‌కు జీవో ఇవ్వాలి



రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.75 వేలు ఇచ్చేలా జీవో ఇవ్వాలి. రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలు పెంచేందుకు. దహన సంస్కారాల ఖర్చులు రూ.20 వేలకు పెంచే హామీకి తక్షణం జీవోలు ఇవ్వాలి. పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం, చెప్పులు, సబ్బులు, కొబ్బరినూనెలు అందించాలి. కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలి.

పి.దుర్గ, పారిశుద్ధ్య విభాగం వర్కర్, ఏలూరు కార్పొరేషన్

నేడు జగన్ భీమవరం రాక



పెదఅమిరంలో హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మోషేనురాజు, కారుమూరి, వెంకటరాయుడు

భీమవరం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం భీమవరం రానున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు కుమారుడి వివాహం బుధవారం కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలోని రాధాకృష్ణ కన్వెన్షన్‌లో జరగనున్నందున వివాహ వేడుకకు హాజరు కానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పెద అమిరంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు చేరుకుని అక్కడి నుంచి కల్యాణవేదికకు వచ్చి వధూవరులను ఆశీర్వదించనున్నారు.

హెలీప్యాడ్ ప్రాంతం పరిశీలన

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం భీమవరం రానున్నందున పెదఅమిరంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌ను మంగళవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, భీమవరం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు పరిశీలించారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం (ప్రకాశం చౌక్): ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన డీఆర్డీఏ, పశుసంవర్ధక శాఖల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం యాన్యువల్ క్రెడిట్ ప్లాన్ కింద జిల్లాకు 1,419 యూనిట్లు మంజూరయ్యాయని, ఎస్‌హెచ్‌జీ మహిళలు వీటి స్థాపన ద్వారా ఆర్థిక పురోభివృద్ధి సాధించాలన్నారు. జిల్లాలో పాల దిగుబడి పెంచేందుకు మేలు జాతి ఆవులు, గేదెలు, కొనుగోలులో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

కొల్లేరు కథ.. కంచికి చేరేనా!

- నేడు సుప్రీంకోర్టులో వాదనలు
- అటవీశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కాంతిలాల్ సమీక్ష



ఏలూరు కలెక్టరేట్‌లో అటవీ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీకి వినతిపత్రం అందిస్తున్న కొల్లేరు ప్రజలు

కైకలూరు: సుప్రీం కోర్టులో కొల్లేరు సమస్యలపై బుధవారం వాదనలు జరగనున్నాయి. దీంతో ఏలూరు కలెక్టరేట్ గౌతమి సమావేశ హాలులో ప్రజాప్రతినిధులు, అధికారులతో కీలక సమావేశం బుధవారం జరిగింది. కైకలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గ ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు హాజరయ్యారు. అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, అటవీ, పర్యావరణ శాఖల ప్రత్యేక కార్యదర్శి శరవనన్, కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కొల్లేరు అంశాలపై చర్చించారు. అనంతరం తాడేపల్లి సీఎంవోలో కొల్లేరుపై సమావేశమయ్యారు. కొల్లేరు అభయారణ్య ఆక్రమణలపై విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి మృత్యుంజయరావు ఫిర్యాదుపై సుప్రీంకోర్టు ఆదేశాలతో కేంద్ర సాధికారిత కమిటీ(సీఈసీ) ఈ ఏడాది జూన్‌లో జిల్లాలో రెండు రోజుల క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. నివేదిక తమకంటే తమకు అనుకూలంగా వస్తుందని పర్యావరణవేత్తలు, కొల్లేరు ప్రజా ప్రతినిధులు ఎదురు చూస్తున్నారు. సీఈసీ అడిగిన వాస్తవ వివరాలను అటవీ, రెవెన్యూ, డ్రైనేజీ శాఖలు అందించలేదు. దీంతో పూర్తి స్థాయి సమాచారం పంపించాలని సీఈసీ కోరింది.

కొల్లేరులో అక్రమ చేపల సాగు యథేచ్ఛగా సాగుతున్నా కూటమి నేతలను ఎదిరించి ఒక్క గట్టు ధ్వంసం చేయలేని స్థితిలో అటవీశాఖ అధికారులు ఉన్నారు. మరోపక్క కొల్లేరు అక్రమ చేపల చెరువుల ధ్వంసం సమాచారం ఇవ్వాలని సుప్రీంకోర్టు పదే పదే అడుగుతోంది. క్షేత్ర స్థాయి లెక్కలను చూపించడంలో అటవీ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. కొల్లేరు అంశాల అధ్యాయానికి వచ్చిన ప్రత్యేక సెక్రటరీ కాంతిలాల్ దండేకు కొల్లేరు నాయకుడు బలే ఏసురాజు ఆధ్వర్యంలో కొల్లేరు ప్రజలు వినతిపత్రాన్ని అందించారు. గోకర్ణపురం – చింతపాడు రహదారిలో 5 కిలోమీటర్ల రోడ్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని 14,932 ఎకరాల జిరాయితీ, 5,510 ఎకరాల డీ-ఫాం భూములను మినహాయించి పేదలకు పంపిణీ చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన కూటమి కార్యకర్తలు



ఉరదాళ్లపాలెంలో కారుమూరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కూటమి కార్యకర్తలు

అత్తిలి: కూటమి పాలన పట్ల విరక్తి చెంది, ఇతర పార్టీల వారు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం సాయంత్రం అత్తిలి మండలం ఉరదాళ్లపాలెంలో కూటమి నుంచి 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామంలో కోపల్లె తాతయ్య నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కారుమూరి నాగేశ్వరరావు సమక్షంలో వీరు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని, గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బుద్ధరాతి ప్రసాద్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబుద్దీన్, బీసీ సెల్ అధ్యక్షుడు కంభ సూరిబాబు, వాణిజ్య విభాగం జోనల్ అధ్యక్షుడు కంకటా సురేష్, పార్టీ నాయకులు రామిశెట్టి రాము, యడ్లపల్లి మణికుమార్, గుండుమోగుల ఉమా మహేష్, కోపల్లి ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్య రథంపై.. దేవదేవుడి విహారం

- ద్వారకాతిరుమలలో వైభవంగా శ్రీవారి రథోత్సవం
- నేడు చక్రస్నానం, ధ్వజావరోహణం



క్షేత్ర వీధుల్లో దివ్య రథంపై ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: బ్రహ్మోత్సవ వేళ.. బ్రహ్మాండనాయకుడిని దర్శించిన వారిది కదా భాగ్యము.. భువి వైకుంఠంలో అడుగిడిన వారిది కదా పుణ్యము.. ఆనందంతో దేవదేవుని కనులారా కాంచిన వారిది కదా జన్మ ధన్యము.. మహిమాన్విత రథంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవారిని సేవించిన వారు కదా పునీతం.. గోవింద నామస్మరణలతో పులకించిన వారిది కదా ముక్తి మార్గం.. రథ వాహనంలో విహరిస్తున్న అలంకార ప్రియుడి కటాక్షం పొందిన వారి జీవితం కదా చరితార్థం.

ద్వారకాతిరుమల శ్రీవారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి ఉభయ దేవేరులతో కలసి దేవదేవుడు దివ్య రథంపై క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. తొలుత ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్లను తొళక్క వాహనంపై ఉంచి, పూజాదికాలు నిర్వహించారు. అనంతరం మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాట భజనలు, అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్ఛరణల నడుమ వాహనాన్ని రథం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ రథంలో ఏర్పాటు చేసిన సింహాసనంపై కల్యాణ మూర్తులను ఉంచి, విశేష పుష్పాలంకారాలు చేసి హారతులిచ్చారు. అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీఎస్ఎన్ నివృతరావు, డీఈఓ భద్రాజీ, ఈఈ డీవీ భాస్కర్, డీఈ, ఏఈఓలు, సూపరింటెండెంట్‌లు పూజలు నిర్వహించి, బలిహరణను సమర్పించగా, రథోత్సవం ప్రారంభమైంది. డప్పు వాయిద్యాలు, వేషధారణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ శ్రీవారి దివ్య రథం క్షేత్ర పురవీధుల్లో తిరుగాడింది. స్వామివారి దివ్య దర్శనంతో భక్తులు పులకించారు. రథోత్సవంలో దేవదేవుడిని సేవించిన వారికి పునర్జన్మ ఉండదని పురాణాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే అశేష భక్తజనులు గోవింద నామస్మరణలతో మహా రథం లాగుతూ తన్మయత్వం చెందారు.



రాజమన్నార్ అలంకారంలో శ్రీవారు



దివ్య రథంపై శ్రీవారికి పూజలు

బ్రహ్మోత్సవాల్లో నేడు..

- ఉదయం 8 గంటల నుంచి – భజనలు
- ఉదయం 9 నుంచి – భక్తిరంజని
- ఉదయం 10.30 నుంచి–చక్రవారి, అవభృదోత్సవం
- ఉదయం 11 నుంచి–కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- సాయంత్రం 4 నుంచి – నాదస్వర కచేరి
- సాయంత్రం 5 నుంచి – బుర్రకథ
- సాయంత్రం 6 నుంచి–కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- రాత్రి 8 గంటల నుంచి – భక్తిరంజని
- రాత్రి 9 గంటల నుంచి – నాటకం
- రాత్రి 9 గంటల నుంచి – ధ్వజావరోహణ, అనంతరం అశ్వ వాహనంపై గ్రామోత్సవం
- ప్రత్యేక అలంకారం : వైకుంఠ నారాయణుడు

సీజేఐపై దాడికి నిరసనగా ర్యాలీ



న్యాయమూర్తులు, న్యాయవాదుల నిరసన ర్యాలీ

భీమవరం: ప్రజల హక్కులను కాపాడేది న్యాయ వ్యవస్థేనని, ఈ వ్యవస్థలో అణగదొక్కాలనో లేదా ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలనో ప్రయత్నించినప్పుడు మేమంతా సంఘటితమేనని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం భీమవరంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. టూటౌన్ ప్రాంతంలోని కోర్టుల సముదాయం నుంచి పాత కోర్టుల ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ న్యాయ దేవత విగ్రహానికి జలాభిషేకం చేసి శుద్ధి చేసారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) జి.సురేష్ బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.హసీష, 2వ అదనపు జ్యుడిషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, ఏపీపీ ఉండవల్లి రమేష్ నాయుడు, ఏజీపీ ఉచ్చుల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయం

భీమవరం: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడి దేశ రాజ్యాంగంపై దాడేనని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్, కెవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు అన్నారు. గవాయ్‌పై దాడిని ఖండిస్తూ మంగళవారం భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో విద్యార్థి, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ జడ్జిపై దాడి ముమ్మాటికీ రాజ్యాంగ వ్యవస్థపై దాడి అన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో ప్రజల మధ్య విభేదాలకు, విభజనకు బీజేపీ ఎలా పాల్పడుతుందో ఈ ఘటన అద్దం పడుతుందన్నారు. కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్, జైభీమ్ సేవా దళ్ నాయకుడు మీసాల జయరాజు, బుద్ధిస్ట్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనా జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త డంప్‌ను అడ్డుకున్న స్థానికులు

- నరసాపురం 28వ వార్డులో ఉద్రిక్తత
- ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నం



ఇళ్ల మధ్యకు వస్తున్న చెత్త వాహనాన్ని అడ్డుకుంటున్న స్థానికులు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో చెత్త డంప్ చేసే విషయంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. స్థానికుల అభ్యంతరాలను పట్టించుకోకుండా, మున్సిపల్ అధికారులు దౌర్జన్యంగా చెత్తను డంప్ చేయడంతో పట్టణంలోని 28 వ వార్డులో ఉద్రిక్తత ఏర్పడింది. స్థానికులు చెత్త డంప్‌ను అడ్డుకోవడమే కాకుండా, కొందరు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయడంతో పరిస్థితి అదుపు తప్పింది. పోలీసు బందోబస్తు మధ్య మున్సిపల్ అధికారులు ఇళ్ల మధ్య ఉన్న మున్సిపల్ స్థలంలో చెత్తను డంప్ చేశారు. మున్సిపాలిటీకి డంపింగ్ యార్డ్ లేకపోవడంతో ఏళ్ల తరబడి చెత్తను గోదావరి గట్టున పోస్తున్నారు. ఇటీవల చెత్త వేయొద్దని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు ఇవ్వడంతో చెత్తను వేయడానికి మున్సిపాలిటీకి జాగా లేకపోయింది. దీంతో చెత్తను 28వ వార్డులో ఉన్న తుంగపాటి చెరువు వద్ద మున్సిపల్ స్థలంలో వేయాలని అధికారులు నిర్ణయించారు. ఆ ప్రాంతం మొత్తం నివాస గృహాలు ఉండటంతో సమస్య మొదలైంది. గతంలో ఒకసారి చెత్తను ఈ ప్రదేశంలో డంప్ చేసే ప్రయత్నం చేయడంతో స్థానికులు అడ్డుకున్నారు. మంగళవారం మళ్లీ ఇక్కడ చెత్తను డంప్ చేశారు.

తీవ్ర ఉద్రిక్తత

చెత్త వాహనాలు రాగానే స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. దళితులు ఉండే ఇళ్ల మధ్య చెత్తను ఎలా వేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త వాహనాలకు అడ్డంగా కూర్చుని నిరసన తెలిపారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు ఒంటిపై పెట్రోల్ పోసుకుని చెత్తను ఇక్కడ డంప్ చేస్తే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపుచేసే ప్రయత్నం చేశారు. చివరకు పోలీసుల సాయంతో చెత్తను మున్సిపల్ స్థలంలోనే డంప్ చేశారు. దీంతో మున్సిపల్ అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ బాధ ఎమ్మెల్యే నాయకర్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు చేసుకుంటామని హెచ్చరించిన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

క్లుప్తంగా

మావుళ్లమ్మ దీక్షాధారణ ప్రారంభం



శ్రీ మావుళ్లమ్మ వారి దీక్షాధారణ పూజలు చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీ మావుళ్లమ్మ వారి మండలి దీక్షా మాలధారణ కార్యక్రమం ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జునశర్మ కలశస్థాపన పూజ జరిపి, ప్రారంభించారు. 145 మంది భక్తులు దీక్షా మాలధారణ ధరించారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. అలాగే ఆలయ ఆవరణలో చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూర్వ ప్రధాన అర్చకుడు మద్దిరాల రామలింగేశ్వరశర్మ జ్ఞాపకార్థం మనవడు మద్దిరాల రామకార్తీక్ ఇత్తడి, రాగితో తయారు చేసిన సుమారు 53 కేజీల హోమగుండాన్ని సమర్పించారు. ఈ హోమగుండాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సంప్రోక్షణ జరిపి చండీహోమం చేశారు.

సుబ్బారాయుడికి ప్రత్యేక అభిషేకాలు



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి మంగళవారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు ఇతర కార్యక్రమాలు నిర్వహించి అభిషేకాలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యన్నదాన ప్రసాదానికి సంబంధించి తగిన ఏర్పాట్లు చేశామని ఈఓ ఆర్ గంగాశ్రీదేవి తెలిపారు.

జిల్లా బాలికల క్రీడా జట్లకు 70 మంది ఎంపిక



తణుకులో ఎంపికైన క్రీడాకారులతో ఫిజికల్ డైరెక్టర్స్

తణుకు అర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలికల క్రీడా జట్ల ఎంపికలు తణుకు ఎస్కేఎస్డీ మహిళా జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. చదరంగం, ఖోఖో, వాలీబాల్, యోగా, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్ విభాగాల్లో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరుకాగా 70 మంది ఎంపికయ్యారని వారిలో 25 మంది ఎస్కేఎస్డీ మహిళా కళాశాల విద్యార్థులు ఉన్నట్లుగా ప్రిన్సిపాల్ భూపతిరాజు హిమబిందు తెలిపారు. కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు జట్ల ఎంపికలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా సెక్రటరీ కె.జయరాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరీబాయ్, ఎస్డీ కళాశాల ప్రిన్సిపల్ వీవీ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాస వెతలకు చెక్

తోటల్లో ఖాళీ ప్రదేశాలను ఉపయోగించుకోవాలంటున్న నిపుణులు



మెట్టలో పశువుల కోసం మామిడి తోటలో చెట్ల మధ్య ఖాళీ ప్రదేశంలో గడ్డి పండిస్తున్న రైతులు

పాడి - పంట

చింతలపూడి: రైతులకు వ్యవసాయంతో పాటు పశు పోషణ ఆర్థికంగా తోడ్పాటునిస్తుంది. ఈ నేపథ్యంలో పశు పోషణలో పశుగ్రాసం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. మెట్ట ప్రాంతంలో పాడి పశువులను పెంచుకునే రైతులు పశుగ్రాసం పండించడంలో మెలకువలు తెలుసుకుంటే మేలు జరుగుతుందని వ్యవసాయ సహాయ సంచాలకులు వై.సుబ్బారావు చెబుతున్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులు ఏర్పడిన సందర్భాల్లో పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ దశలో గ్రామీణ ప్రాంతాల్లో పాడిని నమ్ముకున్న రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. పశు పోషణలో 70 శాతం ఖర్చు మేతకే అవుతుందని తెలిసిందే. ఈ దశలో ప్రభుత్వం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలను రైతులకు సరఫరా చేస్తున్నట్లు ఆయన చెప్పారు. వర్షాకాలంలో పశుగ్రాసం పండించుకుంటే వేసవిలో పశువుల పోషణకు ఇబ్బంది ఉండదని చెబుతున్నారు.

ఖాళీ ప్రదేశాల్లో..

ముఖ్యంగా మెట్ట ప్రాంతంలోని పండ్ల తోటల్లోని మొక్కల మధ్య ఖాళీ ప్రదేశాల్లో పప్పు జాతి పశుగ్రాసాలు అలసంద, ఉలవ, పిల్లిపెసర, జనుము, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేయడం వల్ల పశుగ్రాసం కొరతను అధిగమించడంతో పాటు భూమిలో నత్రజని స్థిరీకరించబడి భూసారం పెరిగే అవకాశాలు ఉంటాయని పేర్కొంటున్నారు.

జనుము

ఇది కాయజాతి పశుగ్రాసం. అన్ని నేలల్లోనూ అన్ని కాలాల్లో కొద్దిపాటి నీటితో కూడ పండించుకోవచ్చు. ఎకరానికి 12 కిలోల విత్తనాలను 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్‌తో కలిపి చల్లాలి. విత్తిన తరువాత 40, 50 రోజులకు కోతకు వస్తుంది. ఈ మేతను పూత దశలో కోసి ఎండు మేతగా వినియోగించుకుంటే ఉపయోగం ఉంటుంది.

పిల్లి పెసర

వరి సాగు చేసే అన్ని భూముల్లో అంతర పంటగా దీన్ని సాగు చేసుకోవచ్చు. సాధారణ భూములకు పచ్చి రొట్టగా వాడితే భూమికి బలం చేకూరుతుంది. శీతాకాలంలో రబీ పంటగా ఈ పశుగ్రాసాన్ని సాగు చేసుకోవచ్చు. ఈ పశుగ్రాసం వేర్లలో నత్రజని బుడిపెలు ఉండటం వల్ల భూమి సారవంతమవుతుంది. వరి పంట కోయడానికి 3,4 రోజుల ముందు అంటే భూమిలో తేమ ఉన్నప్పుడే ఎకరానికి 10-15 కిలోల విత్తనాలను 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్‌తో కలిపి చల్లుకోవాలి. 50 రోజుల్లో కోతకు వచ్చే ఈ పశుగ్రాసం వల్ల ఎకరానికి 10 నుండి 12 టన్నుల పచ్చి మేత లభిస్తుంది.

ఇతర రకాలు

ఇక పశుగ్రాస మొక్కజొన్నలో ఆఫ్రికన్ టాల్ రకం జె 1006-రకం, విజయ కాంపోజిట్ రకాలు 85 రోజులకు ఒకే సారి కోతకు వస్తాయి. పండ్ల తోటలు, పామాయిల్ తోటల్లో కూడ సాగు చేసుకోవచ్చు. రైతులకు అధిక పశుగ్రాసా దిగుబడులను అందిస్తాయి. పప్పు జాతి రకాలైన అలసంద(బొబ్బర్లు) రష్యన్ జైంట్, బుందేల్ లోబియ 1,2, ఇసి 4216-5287, కెబీసీ 2 మొదలైన రకాలు 55 నుండి 60 రోజుల్లో ఒకే కోతలో నాణ్యమైన పశుగ్రాసాన్ని అందిస్తాయి.



వై సుబ్బారావు -వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

వార్డెన్‌కు ఐదేళ్ల జైలు శిక్ష

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వార్డెన్ చేసిన నేరాలు రుజువు కావడంతో మంగళవారం ఐదేళ్ల జైలు, రూ. 5 వేలు జరిమానా విధించినట్లు రూరల్ ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు. భీమవరంలోని విష్ణు కళాశాలలో హాస్టల్ వార్డెన్‌గా బన్నరావూరి వెంకట సుధాకర్ విధులు నిర్వహిస్తూ విద్యార్థుల నుంచి హాస్టల్ ఫీజు వసూలు చేసి కళాశాల యాజమాన్యానికి కట్టకపోవడంతో 2020లో అప్పటి ఎస్సై కె.సుధాకర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. మంగళవారం కేసు విచారణకు రావడంతో వార్డెన్ బన్నరావూరి వెంకట సుధాకర్ చేసిన నేరాలు రుజువు కావడంతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మెజిస్ట్రేట్ భీమవరం జి.సురేష్ బాబు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని పేర్కొన్నారు.

మద్ది అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ



మద్ది క్షేత్రంలో ఆంజనేయ ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో మంగళవారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి నిత్య కైంకర్యాలతో పాటు, నాగవల్లీ దళాల(తమలపాకుల)తో అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఆర్‌వీ చందన మాట్లాడుతూ ఆలయానికి మధ్యాహ్నం వరకు వివిధ సేవల రూపేణా రూ. 2,07,725 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అలాగే స్వామి వారి అన్నప్రసాదాన్ని 1868 మంది భక్తులు స్వీకరించారని పేర్కొన్నారు. అలాగే బుధవారం ఉదయం 8 గంటల నుంచి స్వామి వారి హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్నట్లు స్పష్టం చేశారు.

గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతాల్లో పీఎం జన్మాన్ పథకం కింద విద్య, వైద్యం, విద్యుత్, తాగునీరు, రహదారి వంటి సదుపాయాలు మరింత మెరుగుపరిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో గిరిజనులకు మంజూరు చేసి నిబంధనలపేరుతో నిలుపుదల చేసిన 26 ఇళ్లను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే తమకు సమస్యలు తెలియజేసేందుకు వచ్చిన గిరిజనులపై మర్యాదపూర్వకంగా ఉండాలని చెప్పారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పెద్దవాగు ప్రాజెక్టు మరమ్మతులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి, ఇరిగేషన్ అధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. అనుమతులు రాగానే చర్యలు చేపడతామన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి ఇ.సతీష్, ఐటీడీఏ పీఓ రాములు నాయక్, ఇన్‌చార్జి ఆర్‌డీఓ ముక్కంటి, పోలవరం ప్రాజెక్టు భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ సరళా వందనం తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



పెనుగొండలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గుట్టలుగా పడిపోయిన మోటారుసైకిళ్లు

పెనుగొండ: పెనుగొండ సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం ఉదయం జరిగిన ప్రమాదంలో పెనుప్రమాదం తప్పింది. మంగళవారం కావడంతో సుబ్రహ్మణేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు మోటార్ సైకిళ్లను వరుసగా పార్కింగ్ చేశారు. ఈ తరుణంలో నరసాపురం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఓ మోటారు సైకిల్‌ను వేగంగా ఢీకొనడంతో మోటారు సైకిళ్ల అన్నీ గుట్టలుగా ఒకదానిపై ఒకటి పడిపోయాయి. అయితే, ప్రతి మంగళవారం యాచకులు ఈ మోటారు సైకిళ్ల పక్కనే కూర్చుని భక్తులను యాచిస్తుంటారు. కానీ, ఈ రోజు కొంచెం దూరంలో ఉండి యాచిస్తుండడంతో ప్రమాదంతో ఒక్కసారిగా అప్రమత్తమై పక్కకు తప్పుకున్నారు. అయితే మోటార్ సైకిలిస్టులు నష్టపరిహారం చెల్లించాలంటూ డిమాండ్ చేశారు.

వరిపైరులో పురుగుల పని పట్టండిలా

చిరు పొట్ట దశలో వరిపైరుకు పురుగుల బెడద



వరిపైరును పరిశీలిస్తున్న అధికారులు, రైతులు



ఆకుముడత పురుగు ఆశించిన పైరు



వరిలో ఆకుముడత పురుగు



వరిలో కాండం తొలుచు పురుగు



వరి సాగులో దోమల ఉధృతి

కైకలూరు: వరి పైరు చిరు పొట్ట దశలో ఉంది. ఈ దశలో వరిపైరుపై పురుగులు, తెగుళ్లు దాడి చేస్తున్నాయి. ఏలూరు జిల్లాలో 2,45,855 సాధారణ వరి విస్తీర్ణానికి గానూ 2,00,490 ఎకరాల్లో నాట్లు వేశారు. మొత్తం రైతులు 1,36,468 రైతులు ఉండగా, వీరిలో 32,074 మంది కౌలు రైతులు ఉన్నారు. ప్రస్తుత తరుణంలో పురుగుల వ్యాప్తిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను కైకలూరు మండల వ్యవసాయాధికారిణి ఆర్.దివ్య సూచనలు చేశారు.

కాండం తొలుచు పురుగు

నారుమడి దశ నుంచి ఈనిక దశ వరకు వరి పైరును కాండం తొలుచు పురుగు నష్టపరుస్తుంది. దీనినే మొవ్వ పురుగు, పీక పురుగు, తెల్లకంకి అంటారు. ఖరీఫ్‌లో తక్కువ నుంచి మధ్యస్థంగా, రబీలో మధ్యస్థం నుంచి ఎక్కువగా ఆశిస్తుంది. నారుమడిలో ఆశిస్తే మొక్కలు, పిలక దశలో ఆశిస్తే మొవ్వ చనిపోతుంది. ఈనిక దశలో ఆశిస్తే కంకి పాలు పోసుకోక తెల్ల కంకి ఏర్పడుతుంది గుడ్డు నుంచి వచ్చిన లార్వా కాండము కింద వైపు నుంచి లోపలికి ప్రవేశించి మొవ్వను తినేస్తోంది.

నివారణ చర్యలు..

నారు పీకటానికి వారం రోజులు ముందు 5 సెంట్ల నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను పలుచగా చల్లి మడిలోనే ఇంకేటట్లు చేయాలి. పిలక, దుబ్బు చేసే దశలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరానికి 10 కిలోలు వేయాలి. ఎసిఫేట్ 75 ఎస్.పి.1.5 10 కిలోలు వేయాలి లేదా ఎసిఫేట్ 75 ఎస్‌పీ1.5 గ్రా, లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ 2 గ్రా, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అంకురం నుంచి చిరుపొట్ట దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు, లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 శాతం గుళికలు 4 కిలోలు వేయాలి.

ఆకుముడత

పంట నాటిన దగ్గర నుంచి పోటాకు దశ వరకు ఆకుముడత ఆశిస్తుంది. దీనినే నాము, తెల్ల తెగులు అంటారు. ఇది సీతాకోక చిలుకలగా ముదురు గోధుమ రంగులో ఉండి రెక్కల అంచుల మధ్య సన్నని నల్ల గీతలుంటాయి. పొలంలో నడస్తూ ఉంటే గుంపులు గుంపులుగా ఎగిరే రెక్కల పురుగులను బట్టి అకుముడతను గుర్తించవచ్చు. ఆలస్యంగా నాటిన పొలాల్లో, వర్షభావ పరిస్థితుల లోను, చుట్టూ నీడ ప్రదేశాలు ఉండటం, నత్రజని ఎరువు అధిక మోతాదులో వాడటం వల్ల దీని ఉధృతి పెరుగుతుంది. పొటాకు దశలో దుబ్బుకి 1 నుంచి 2 కొత్తగా తెల్లగా గీకబడిన ఆకులు, వాటిలో చిన్న లార్వాలు గమనించిన వెంటనే సస్యరక్షణ చేపట్టాలి.

నివారణ చర్యలు

పరాన్నజీవులైన ట్రైకోగ్రామా ఖిలోనిస్‌ను ఎకరాకు 20,000 చొప్పున మూడు సార్లు వదలాలి. పిలక దశలో చేనుకు అడ్డంగా తాడును 2-3 సార్లు లాగితే పురుగులు పడిపోతాయి. నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ, లేదా ఎసిఫేట్ 1.5 గ్రా, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పొట్ట ఆకు దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ 2 గ్రా, లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 20 ఎస్‌పీ 0.4 మిల్లీ గ్రాములు, లేదా ఫ్లూబెండామైడ్ 20 డబ్ల్యూడీజీ 0.25 గ్రా, లేదా ఫ్లూబెండమైడ్ 48 ఎస్‌పీ 0.1 మి.లీ, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ 8 కిలోల లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 శాతం 4 కిలోలు గుళికలు ఎకరాకు చొప్పున వేయాలి.

సుడిదోమ

నారుమడి, పిలక, పొట్ట, ఈనిక దశల్లో దోమలు నీటి మట్టంపై ఉంటూ దుబ్బుల నుంచి రసం పీల్చడం ద్వారా నష్టాన్ని కలుగిస్తాయి. వీటిలో దోమపోటు, గోధుమ వర్ణపు దోమ, తెల్ల మచ్చ దోమలు కీలకమైనవి. వీటి ఉధృతి ఎక్కువైతే పొలం ఎండి పడిపోవటం, తాలు గింజలు, నూర్పిన్నప్పుడు నూక అవుతుంది. తొలి దశలో రసాన్ని పీల్చడం వల్ల పైరు లేత పసుపు వర్ణానికి మారుతుంది. ఉధృతి పెరిగే కొద్ది పైరు సుడులు సుడులుగా వలయకారంలో ఎండిపోతూ ఉంటాయి. నత్రజనిని అధిక మోతాదు, కాలి బాటలు తీయని పొలాల్లో, పైరు తొలిదశలో ఆకులను ఆశించే పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్, ప్రొఫెనోఫాస్, సింథటిక్ పైరథ్రాయిడ్ మందులను వాడినపుడు ఈ పురుగు ఉధృతి ఎక్కువవుతోంది.

నివారణ చర్యలు

పిలకల దశలో దుబ్బుకు 10 దోమలు, ఈనిక దశలో దుబ్బుకు 20-25 దోమలు గమనించిన వెంటనే సస్యరక్షణ చేపట్టాలి. వరి నాటేటప్పుడు ప్రతి 2 మీటర్లకు 20 సెంటీ మీటర్ల బాటలు తీయాలి. దీని నివారణకు లీటరు నీటికి ఎసిఫేట్ 1.5 గ్రా,లేదా మోనోక్రోటోఫాస్ 2.2 మి.లీ లేదా ఇథోఫెనోప్రాక్స్ 2 మి.లీ, లేదా ఫెనోబుకార్బ్ 2 మి.లీ, లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ, లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా, లేదా బుప్రోఫెజిన్ 1.6 మి.లీ, లేదా పైమెట్రోజైన్ 0.6 గ్రా, లేదా ట్రైఫ్లూమిజోఫైరిమ్ 0.486 మి.లీ, పిచికారీ చేయాలి.



కైకలూరు మండల వ్యవసాయాధికారిణి ఆర్.దివ్య

పెదవేగి ఎంఈఓ-1పై విచారణకు ఆదేశం

ఏలూరు (టూటౌన్): పెదవేగి ఎంఈఓ-1 పై జాతీయ ఎస్టీ కమిషన్ విచారణకు ఆదేశించింది. పెదవేగి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామచంద్రపురంలో పనిచేస్తున్న పీఎస్ హెచ్‌ఎం జి.కృష్ణకు జూలై నెల జీతం చేయకుండా వేధించినందుకుగాను జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఆగస్టు నెలలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన జాతీయ ఎస్టీ కమిషన్ గత నెల 19న జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి నోటీసులు జారీ చేసింది. దీంతో ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఇటీవల పెదవేగి మండల విద్యాశాఖ అధికారి-1పై విచారణ చేసేందుకు ఏలూరు ఉప విద్యాశాఖ అధికారి ఎస్.రవీంద్ర భారతి, దెందులూరు ఎంఈఓ ఏవీఎన్‌వీ ప్రసాద్ లను విచారణ అధికారులుగా నియమిస్తూ ఆదేశాలు ఇచ్చారు. విచారణ నివేదికను ఈ నెల 12 లోగా తమకు అందించాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

విజయవాడకు తరలి వెళ్లిన ఉపాధ్యాయులు



నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా నుంచి చలో విజయవాడ పోరుబాట కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో మహిళా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తరలి వెళ్లారు. ఈ ధర్నాకు 10 వేలు పై చిలుకు హాజరవ్వగా ఒక్క ఏలూరు జిల్లా నుంచే ఈ కార్యక్రమంలో సుమారు 1000 మందికి పైగా హాజరైనట్లు నాయకులు చెబుతున్నారు. బోధనేతర పనులను బహిష్కరించడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ జి.మోహన్, సెక్రటరీ జనరల్ యం.ఆదినారాయణ, కో-చైర్మన్లు జి. వెంకటేశ్వరరావు, జి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల లారీ సీజ్

దెందులూరు: హైదరాబాద్ నుంచి కుర్రెళ్లగూడెం చేపల చెరువుకు వెళ్తున్న కోళ్ల వ్యర్థాల లారీని మంగళవారం గుండుగొలను వద్ద పట్టుకుని సీజ్ చేశామని దెందులూరు హెచ్‌సీ హమీద్ అన్నారు. ముందస్తు సమాచారంతో గుండుగొలను వద్ద లారీ పట్టుకున్నామన్నారు. ఈ నేరంతో సంబంధం ఉన్న ఐదుగురు నిందితుల పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

బీచ్‌కు వచ్చే సందర్శకుల రక్షణకు చర్యలు తీసుకోవాలి



మహర్షి వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పేరుపాలెం, కేపీ పాలెం బీచ్ సందర్శకుల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బీచ్ సందర్శకుల రక్షణ ఏర్పాట్లపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ మెరైన్ పోలీసులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, బీచ్ సందర్శకులను అప్రమత్తం చేయడంతో పాటు, వారి భద్రతకు పటిష్టమైన చర్యలను చేపట్టాలన్నారు. పేరుపాలెం బీచ్‌లోని స్థానిక లా - ఆర్డర్ పోలీసులతో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను కూడా నిర్వహించాలని సూచించారు. పేరుపాలెం బీచ్‌లో కొత్త కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ కోసం భూమిని సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, విశాఖపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ డీఎస్పీ జి.బాలిరెడ్డి, అంతర్వేది మెరైన్ ఇన్‌స్పెక్టర్ నవీన్ నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహర్షి వాల్మీకికి నివాళులు

భీమవరం (ప్రకాశం చౌక్): రామాయణ మహాకావ్యాన్ని రచించి జాతికి సన్మార్గాన్ని నిర్దేశించిన మహోన్నత వ్యక్తి మహర్షి వాల్మీకి అని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ బి.శివన్నారాయణ రెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు.

మద్యం తాగి వాహనాన్ని నడిపిన వ్యక్తికి జైలు

భీమడోలు: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి ఏలూరులోని మేజిస్ట్రేట్ 14 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని భీమడోలు సీఐ యూజే విల్సన్ మంగళవారం రాత్రి విలేకరులకు తెలిపారు. భీమడోలులో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమంలో వాహనాలను తనిఖీలు చేస్తున్న సమయంలో ఆర్జావారిగూడెంలోని పూనూరి ప్రవీణ్‌కుమార్ మద్యం సేవించి వాహనాన్ని నడుపుతున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామని వివరించారు. ముద్దాయికి ఏలూరులోని మేజిస్ట్రేట్ కేవీఆర్ మహేశ్వరి శిక్ష విధించారని స్పష్టం చేశారు.

ముగ్గురికి జరిమానా

చింతలపూడి: మండలంలోని యండపల్లి గ్రామంలో ఎస్సై కె.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ముగ్గురు వ్యక్తులు మద్యం తాగారని గుర్తించి, కేసు నమోదు చేసిన చింతలపూడి కోర్టులో మంగళవారం హాజరుపరిచారు. సివిల్ కోర్టు జడ్జి సీహెచ్ మధుబాబు ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అందజేత



పోగొట్టుకున్న బ్యాగ్‌ను అందిస్తున్న పోలీసులు

భీమవరం: స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో స్కూటీపై వస్తూ బంగారపు వస్తువులు, నగదు కలిగిన బ్యాగ్‌ను జారవిడుచుకున్న మహిళకు మంగళవారం టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ అందచేశారు. గత నెల 27న చెనపాక జ్యోతి జువ్వలపాలెం రోడ్డులోని అడ్డవంతెన వైపు నుంచి కాసున్నర బంగారు వస్తువులు, రూ.60 వేల నగదు బ్యాగ్‌లో పెట్టుకుని స్కూటీపై బయలుదేరింది. మార్గమధ్యలో బ్యాగ్ జారవిడుచుకోగా ఆ బ్యాగ్ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బుంగా రాజుకు దొరికడంతో ఆయన పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. బ్యాగ్‌లో ఉన్న బ్యాంక్ పాస్‌బుక్‌లోని వివరాలు ఆధారంగా బాధితురాలికి తెలియజేయడంతో సీఐ కాళీచరణ్ సమక్షంలో బ్యాగ్‌ను జ్యోతికి అందించారు.

యువకుడి మృతి

భీమవరం: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి రక్తదానం చేసిన యువకుడు కొద్దిసేపటికే మృతి చెందాడు. వివరాల ప్రకారం పాలకోడేరు మండలం మోగల్లు గ్రామానికి చెందిన ఎస్.నరేష్ తన స్నేహితుడి బంధువైన వృద్ధురాలు పట్టణంలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా నరేష్ రక్తదానం చేశాడు. అనంతరం నరేష్, అతని స్నేహితుడు బీర్ సేవించగా చాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో దగ్గరలోని వైద్యుడికి చూపించారు. అనంతరం ఒక్కసారిగా నరేష్ కుప్పకూలి మరణించాడు. దీనికి సంబంధించి వివరాలు సేకరిస్తున్నామని వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు తెలిపారు.

క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వడ్డి రఘురాంనాయుడు

తాడేపల్లిగూడెం : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్టు ఆ పార్టీ రాష్ట్ర రైతు విభాగం ఆక్వా కల్చర్ వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం నాయుడు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

వైద్య శిబిరానికి 22 మంది వృద్ధుల హాజరు



తణుకులో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రమేష్ చంద్రబాబు

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 22 మంది రోగులు హాజరయ్యారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వృద్ధులకు వైద్యసేవలందించారు. బీపీ, సుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి పేద రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులు తీసుకోవాల్సిన ఆహార అలవాట్లు, వ్యాయామం, నడక వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం



బియ్యం అందజేస్తున్న గ్లోబల్ ఆర్గనైజేషన్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆర్గనైజేషన్ నిర్వాహకురాలు చెన్న త్రికాల ఆధ్వర్యంలో పడాలలోని జీవన సంధ్య వృద్ధుల ఆశ్రమానికి 200 కేజీలు బియ్యం, లార్డ్ ఆఫ్ లైఫ్ అనాథాశ్రమానికి 150 కేజీలు బియ్యం, నిడదవోలు లెప్రసీ కాలనీలోని నిరాశ్రయులకు 300 కేజీలు బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత వాణి, బ్రహ్మజీ, కేశవవర్మ, తదితరులు పాల్గొన్నారు.

దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలి



పెంటపాడు బాలుర వసతిగృహంలో పరుపులపై సేదతీరుతున్న విద్యార్థులు

పెంటపాడు: దాతలు అందిస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పెంటపాడు మండల పరిషత్ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న తోరాటి వెంకట సత్యనారాయణ 45 మంది విద్యార్థులకు వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో సంతోషించి దాత అయిన కార్యాలయ సూపరింటెండెంట్ టీవీ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంతటి సాయం అందించిన దాత సత్యనారాయణను ఎంపీడీవో రాంప్రసాద్, గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ తదితరులు అభినందించారు. గ్రామ కార్యదర్శి గోడి బాలకృష్ణ, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెదతాడేపల్లిలో జీఎస్టీపై అవగాహన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు జీఎస్టీ తగ్గింపు ఒక వరమని పేర్కొన్నారు. తద్వారా ఆయా వర్గాల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం జీఎస్టీపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎక్కడికక్కడే నిలిచిన ఇంటి నిర్మాణాలు



కొండ్రుప్రోలు జగనన్న కాలనీలో అసంపూర్తిగా నిలిచిన ఇంటి నిర్మాణాలు



కొండ్రుప్రోలు జగనన్న కాలనీకి వెళ్లే రహదారి

- 25 లే అవుట్లలో 1538 ఇళ్లు మంజూరు
- 730 పూర్తి..మరో 400 ఇళ్లు వివిధ దశల్లో!
- పిచ్చిమొక్కలతో ఇళ్లు
- డిసెంబరు 31వ తేది నాటికి పూర్తి చేస్తే బిల్లులు

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రతి పేద వాడికి సొంతింటి సౌకర్యం కల్పించాలని జగనన్న కాలనీల పేరిట గృహ సముదాయాలకు శ్రీకారం చుట్టింది. అప్పట్లో ఒకే ఇంటిలో ఒకట్రెండు కుటుంబాలు ఉంటున్న వారిని గుర్తించి సొంతింటి స్థలం మంజూరు చేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు సాయాన్ని అందజేసింది. ఇలా తాడేపల్లిగూడెం మండలంలో 25 లే అవుట్లలో 1538 ఇళ్లు మంజూరు చేసింది. అయితే, ఇప్పటి వరకు 730 ఇళ్లు పూర్తయ్యాయి. మరో 400 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన రూ.1.80లక్షలకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.70వేలు ప్రకటించింది. గత కొంతకాలంగా ప్రభుత్వ ఇంటి నిర్మాణాలను ముందుకు సాగని పరిస్థితి. దీంతో ఫౌండేషన్ దశలో ఉన్న ఇంటి స్థలాల్లో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే నిర్మాణమైన కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు కాలనీల్లోకి వర్షపు నీరు చేరి రోడ్లపై అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. రోడ్లు గాని, డ్రెయినేజీలు గాని లేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

> **డిసెంబరు 31కి పూర్తి చేయాలి**
>
> తాడేపల్లిగూడెం మండలంలో వివిధ దశల్లో ఉన్న 400 ఇళ్లను ఈ ఏడాది డిసెంబరు 31వ తేది నాటికి పూర్తి చేస్తే త్వరితగతిన బిల్లులు మంజూరు చేస్తాం. లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు చేపట్టాలి.
>
> – బి.సూర్యచంద్రరావు, హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈ, తాడేపల్లిగూడెం

ఘనంగా అన్నసమారాధన



విశేష అలంకరణలో ప్రత్తిపాడు కాగులంపాడు కనకదుర్గమ్మ

పెంటపాడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని మంగళవారం ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామంతో పాటు, చుట్టుపక్కల సుమారు 4వేలమంది భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కూచి చంద్రమౌళి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు వీర్ల రాంబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహంకాళమ్మకు విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఏలూరురోడ్డులోని శ్రీదేవి మహంకాళమ్మ తల్లి ఆలయంలో 8వ వార్షిక దసరా మహోత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం అఖండ అన్నసమారాధన జరిగింది. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడికి న్యాయవాదుల నిరసన



తణుకులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

తణుకు అర్బన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి న్యాయ వ్యవస్థపై దాడి చేయడమే అని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామన మునిస్వామి అన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు తణుకు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో న్యాయవ్యవస్థకు ప్రత్యేక స్థానం ఉందని, అటువంటి న్యాయ వ్యవస్థలో ఉన్నత స్థానంలో ఉన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీఆర్ గవాయ్‌పై మతోన్మాది దాడి చేయడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కొర వెంకటేశ్వర్లు, ఎం.మృత్యుంజయరావు, కొండా శ్రీనివాస్, పుట్ల శ్రీనివాసు, కొమ్మిశెట్టి స్వామి నాయుడు, షేక్‌బాబ్జి, జి చంద్రరావు, కొలి ఆనందకుమార్, దొమ్మేటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

సీజేఐపై దాడి దుర్మార్గం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని మాలమహనాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అని తెలిపారు. మంగళవారం మండలంలోని ఏఎస్ఆర్ నగర్‌లో న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై బూటుతో దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. సీజేఐపై దాడి ముమ్మాటికి రాజ్యాంగంపై దాడే అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి తెగబడ్డారంటే సామాన్య ప్రజలకు రక్షణ ఏముంటుందన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడిని ప్రజలు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు గ్రామసర్పంచ్ తాడేపల్లి సూర్యకుమారి, ఈశ్వరరావు, పొట్ల విజయకుమార్, దేవాబత్తుల బాబీ, గెద్దం అచ్చిబాబు, రాజేష్, కిరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు తెలిపారు.

మంచి మానసిక ఆరోగ్యమే సంపద



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌కుమార్

తణుకు అర్బన్: ప్రతి వ్యక్తికి మానసిక ఆరోగ్యం, మానసిక బలం ఒక సంపదగా ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొందని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ బి.రమేష్‌కుమార్ అన్నారు. ప్రపంచ మానసిక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఇండియన్ సైక్రియాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి ఆధునిక గజిబిజి జీవనంలో సరైన ప్రణాళిక లేకపోవడంతో అధికశాతం ఒత్తిడికిలోనై డ్రెషన్‌లోకి వెళ్లి అనారోగ్యాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సరైన ప్రణాళికలతో ఎప్పుడు చేయాల్సిన పనిని అప్పుడే చేసేలా ఉండాలని, చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. మంచి విషయాలను ఆస్వాదిస్తూ చెడు విషయాలను వదిలివేసే తత్వాన్ని అలవరచుకుంటే మానసికంగా ఫిట్‌గా ఉంటారని అన్నారు. ముఖ్యంగా చిన్నతనం నుంచే మంచి పోషకాహారం తీసుకుంటూ, వ్యాయామం చేయాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం కె.పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, ఏకేటీపీ హైస్కూల్ హెచ్‌ఎం టి.రామకృష్ణ, స్కూల్ స్టాఫ్ సెక్రటరీ కె.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మంచి ఆహారంతోనే ఆరోగ్యం



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

అత్తిలి: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ తిరుపతిపురం సెక్టార్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా మంగళవారం అత్తిలి మండలం గుమ్మంపాడు -2 కేంద్రంలో మూడేళ్ల లోపు పిల్లల తల్లులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ పిల్లల తల్లులు తమ చేతులను శుభ్రం చేసుకుని ఫీడింగ్ ఇవ్వాలని, మొబైల్‌ఫోన్ చూపిస్తూ పిల్లలకు ఆహారం తినిపించరాదని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో తమ చిన్నారులకు ఎత్తులు, బరువులను చూపించుకోవాలన్నారు. తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వడం, ఆహార పదార్థాలను వైవిధ్యంగా ఎలా తయారు చేయాలో వండి చూపించారు. పిల్లలకు పోషకాహారంతో పాటు మునగాకు, మెంతికూర రోజు వారి ఆహారంగా ఇవ్వాలని కోరారు. జంక్‌ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్, నూనె అధికంగా గల ఆహార పదార్థాలను తినడం వల్లే ఊబకాయం వస్తుందన్నారు. రోజు పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని, నూనె శాతాన్ని, పంచదార వాడకాన్ని తగ్గించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్త బి రాజకుమారి, సహాయకురాలు పి చిట్టిమరియ పాల్గొన్నారు.

సమాజ సేవలో లయన్స్ సేవలు మరువలేనివి



లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బుషెల్‌ను సత్కరించిన రవీంద్రనాథ్, లయన్స్ ప్రతినిధులు

తణుకు అర్బన్: విద్య, వైద్యంతోపాటు ఇతర సామాజిక అంశాల్లో లయన్స్ అందిస్తున్న సేవలు అట్టడుగు స్థాయికి చేరువయ్యాయని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ నదీనె బుషెల్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిర్వహిస్తున్న శ్రీవంక సత్యనారాయణ, నాగమణి రెనాల్ డయాలసిస్ సెంటర్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా డయాలసిస్ సెంటర్ ద్వారా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలు అభినందనీయమని స్పష్టం చేశారు. తణుకు లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని, డయాలసిస్ చీఫ్ డోనర్ అయిన పీఎంసీసీ వంక రవీంద్రనాథ్ అందిస్తున్న సేవలను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో లయన్స్ క్లబ్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ సేవలను కొనియాడారు. స్పందన మానసిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ సర్వీస్ కో ఆర్డినేటర్ వంక రాజకుమారి ఆర్థిక సాయంతో నిత్యావసర సరుకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు దామెర రంగారావు, మాదిరెడ్డి బాబూజీరావు, పాపారావు నాయుడు, రామలింగేశ్వరరావు, డాక్టర్ కుదారి ఆనంద్, కుదారి సజిని తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఇరగవరం: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఇరగవరం ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం ఇరగవరం, అత్తిలి మండలాల అధికారులు, సర్పంచ్‌లతో సుస్థిర లక్ష్యాల శిక్షణ కార్యక్రమానికి ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాస్ పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి, ఇరగవరం మండల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐసీసీ 5వ వార్షికోత్సవం



పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న ఏఐసీసీ నాయకులు

పెంటపాడు: క్రైస్తవ సంఘాలు, విశ్వాసుల ఆధ్యాత్మిక అభివృద్ధి ఏఐసీసీ (ఆల్‌ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్) ద్వారానే సాధ్యమని సంస్థ జాతీయ నాయకులు బిషప్ డేవిడ్ లివింగ్ స్టన్, మల్లిపూడి జైబాబుల పేర్కొన్నారు. ఆల్‌ఇండియా క్రిష్టియన్ 5వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం గూడెంలోని స్థానిక గీతా పంక్షన్ ప్లాజాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా ఉపద్రవం సందర్భంగా ప్రధానంగా సంఘాలకు అండగా ఏఐసీసీ నిలబడిందన్నారు. ఆపదలో ఉన్నవారికి నిత్యవసరాలు, మెడికల్ కిట్‌లు, దుస్తులు ఆహారప్యాకెట్లు అందిస్తూ అనంతర కాలంలో పేద విద్యార్థులను గుర్తించి వారికి విద్యా సామగ్రి, దుస్తులు అందజేస్తున్నట్లు తెలిపారు. సేవ.. రక్షణ నినాదంలో ముందుకు వెళుతున్న ఏఐసీసీకి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. బిషప్ ఐజక్‌ముగ్గళ్ల, సందెపు జాన్, డేనియల్‌రాజు, నోవా, రాజబాబు, లీగల్ అడ్వైజర్ గ్లోరీ ఆనంద్, విమన్స్ వింగ్ రూత్‌ప్రభ, రాష్ట్ర నాయకులు ఏసుపాదం, రీజనల్ అధ్యక్షుడు రాజారత్నం, ఏపీ బహుజన జేఏసీ కన్వీనర్ తాళ్లూరి మధు, గౌరవ అధ్యక్షుడు కాటం స్లాన్లీరాజు పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో మండల స్థాయి ఎంపికలు

అత్తిలి: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆటల పోటీలకు సంబంధించి మండల స్థాయి సెలక్షన్స్ ఈనెల 8, 9 తేదీలలో జరుగుతాయని ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ ఎస్ దిలీప్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. అండర్-14, బాలుర, అండ్ గర్ల్స్, అండర్ -17 బాలుర, అండ్ గర్ల్స్ విభాగాలలో అథ్లెటిక్స్, చెస్, కబడ్డీ, కోకో, షటిల్, వాలీబాల్, యోగా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈపోటీలు జరుగుతాయని, ఇతర వివరాలకు 83418 35153 నంబర్‌ను సంప్రదించాలని దిలీప్‌కుమార్ కోరారు.

ఆరోగ్య సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న పేరిచర్ల మురళీకృష్ణంరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ):సుగర్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేరిచర్ల ఫౌండేషన్ అధినేత పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. పేరిచర్ల ఫౌండేషన్, డైమండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో నెలవారీ సుగర్ వ్యాధి అవగాహన శిబిరం, ఉచిత రక్త పరీక్షల శిబిరం మంగళవారం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ సుగర్ వ్యాధిని నియంత్రించేందుకు అవసరమైన వ్యాయం, నడక, యోగా, పోషకాహారం, ప్రొటీన్ ఫుడ్, డ్రై ఫ్రూట్స్, అవసరమైన ఆకు కూరలు తప్పక తీసుకోవడం ద్వారా సుగర్ వ్యాధి అదుపులో ఉంటుందన్నారు. అన్ని వయస్సుల వారిని సుగర్ వ్యాధి పట్టి పీడిస్తుందని, తగిన జాగ్రత్తలు తప్పక తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి సతీష్, అపర్ణ గ్రంధి ప్రసాద్, ముఖర్జీ, మానేపల్లి కిరణ్, గాజుల మురళీకృష్ణ, యర్రా ఆంజనేయస్వామి, దాసరి వెంకటేశ్వరరావు, బాబురావు, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత అవసరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని లయన్స్, ఆరా ఫౌండేషన్ నిర్వాహకులు కరిబండి రామకృష్ణ వెల్లడించారు. స్థానిక సత్యవతి నగర్‌లోని ఉమర్ అలీషా పీఠంలో లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, పేరిచర్ల మురళీకృష్ణంరాజు సహకారంతో మానసకి ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం జరిగింది. వక్తలు మాట్లాడుతూ మానసిక రుగ్మతలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనారోగ్యం, ఆర్థికసమస్యల కారణంగా ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. గట్టిం ప్రవీణ్ కృష్ణ, నవీన్ వెంకన్న బాబు, నున్న నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పంచాయతీ నిబంధనలను సర్పంచ్‌లకు తెలియజెప్పాలి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు

తాడేపల్లిగూడెం రూరల్: పంచాయతీ నియమ, నిబంధనలను సర్పంచ్‌లకు తెలియజెప్పాల్సిన బాధ్యత కార్యదర్శులదేనని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో తాడేపల్లిగూడెం, నల్లజర్ల మండలాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండ్రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. తొలుత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రపతి తర్వాత చెక్ పవర్ ఒక్క సర్పంచ్‌లకే ఉందన్నారు. సర్పంచ్ పదవి ఎంతో గౌరవ ప్రదమైన పదవి అని పేర్కొన్నారు. పదవీ కాలం ముగుస్తున్న సమయంలో శిక్షణ తరగతులు ఏంటని నిరుత్సాహ పడొద్దని గ్రామ అభివృద్ధికి ఒక పౌరుడిగా సర్పంచ్‌ల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, డ్వామా ఏపీడీ జీవీకే.మల్లిఖార్జునరావు, ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెంట్లమ్మకు విశేష పూజలు



కొలనువాడను సన్మానించిన పెంట్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు

పెంటపాడు: మండలంలోని కె.పెంటపాడు గ్రామ దేవత పెంట్లమ్మ అమ్మవారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అలంపురం వెంకటరమణ సేవా ఛారిటీ అధ్యక్షుడు కొలనువాడ పెదకృష్ణంరాజును ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంధం సతీష్, మల్లెల ప్రసాద్, సంతోష్, కమిటీ పెద్దలు, గ్రామస్తులు, వెంకటరమణ ఛారిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు దువ్వ విద్యార్థులు

తణుకు అర్బన్: జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో తణుకు మండలం దువ్వ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం బండి ఆంజనేయులు తెలిపారు. మంగళవారం వీరవాసరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో అండర్-14 విభాగంలో కె.ప్రసన్న, అండర్-17 విభాగంలో టి.మేఘన, పి.మాధురి ఈ ఘనత సాధించినట్లు వివరించారు. విద్యార్థినులతోపాటు వారికి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కటికితల బాబూరావును ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు అభినందించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

పెనుగొండ: ధాన్యం అమ్మకాల్లో దళారులను నమ్మి మోసపోవద్దని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మంగళవారం ఆచంటలో సార్వా ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన కల్పించారు. కనీస మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2,389, సాధారణరకానికి రూ.2,369 గా నిర్ణయించామన్నారు. పంట నమోదు చేయించుకొన్న రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. గోనే సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు.